క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


భీమసింగిలో పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి


ఏ.ఆర్.పేటలోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి, ఏ.ఆర్.పేట వేణుగోపాలస్వామి ఆలయాల్లో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం తులసి మాలలు, వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాతను అభినందిస్తున్న వైద్యసిబ్బంది, బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు

చీపురుపల్లి: స్థానిక సీహెచ్‌సీలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 18మంది యువకులు రక్తదానం చేశారు.మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవ స్థాపకుడు బి.వి.గోవిందరాజులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు వారు రక్తదానం చేయవచ్చని చెప్పారు. అపోహలు వీడి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆస్పత్రి వైద్యసిబ్బంది, బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి ఖోఖో పోటీలు


ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


గజపతినగరం: మండలంలోని మరుపల్లి ఉన్నత పాఠశాలలో గజపతినగరం నియోజవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీ లను శనివారం నిర్వహించారు. ఈపోటీలను హెచ్ ఎం నాగమణి ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలుర, బా లికల విభాగాల్లో నిర్వహించిన ఈపోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ, గంట్యాడ మండలాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని హెచ్‌ఎం తెలిపారు. విజేతలను హెచ్ ఎంతో పాటు పీఈటీలు సత్యనారాయణ, బైరెడ్డి శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్ అభినందించారు. విజేతలు ఈనెల29న నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

మెరకముడిదాం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బుదరాయవలస ఎస్‌ఐ జి.లోకేశ్వరరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై సింగవరం గ్రామంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి అనవసరంగా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవద్దని చెప్పారు. అపరిచితుల నుంచి ఎస్‌ఎంఎస్, ఈ మెయిల్, వాట్సప్‌ల ద్వారా వచ్చే బ్లూకలర్ లింక్స్‌ను క్లిక్ చేయవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి రవాణా చేసినా, వినియోగించినా నేరమేనని, అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దని యువతకు సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి



శ్రావణ్‌కుమార్ (ఫైల్)

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో 30 ఏళ్లుగా న్యాయవాదిగా పని చేస్తున్న కొయ్యాన శ్రావణ్‌కుమార్ శుక్రవారం రాత్రి గుండె పోటు తో మృతి చెందారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిట్రా సూర్యారావు శనివారం తెలిపారు. గురువారం విధి నిర్వహణలో ఉంటుండగానే శ్రావణ్‌కుమార్‌కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారని, అక్కడ వైద్యసేవలు పొందుతూ మృతి చెందారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు న్యాయవాదులు సంతాపం తెలిపారు.

‘పెంపు’ యత్నం ఫలించేనా..!

- ఎస్.కోటలో పంచాయతీ దుకాణాల అద్దె పెంపుపై నోటీసులు
- పాత అద్దెలే కొనసాగించేలా బినామీల లాబీయింగ్
- నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దుకాణాల నిర్వాహకులు


ఎస్.కోట పట్టణంలో పంచాయతీ దుకాణల సముదాయంలో ఓ భాగం


దుకాణాల అద్దె పెంపుపై పంచాయతీ జారీ చేసిన నోటీసు

శృంగవరపుకోట: ఔను..ఎస్.కోటకు గ్రహణం పట్టింది. ఇక్కడ పట్టణాభివృద్ధి కోరే వారికన్నా ఫలితం లేని రాజకీయాలు చేసేవాళ్లే ఎక్కువ. దీంతో పాలకులు ఎవరైనా అభివృద్ధి మాత్రం శూన్యం. పంచాయతీ దుకాణాల అద్దెల పెంపు అంశం కూడా ఇలాగే రాజకీయ కంపుకొడు తోంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో పాత షాపింగ్ కాంప్లెక్స్‌లో 12, కొత్త షాపింగ్ కాంప్లెక్స్ బ్లాక్-1లో 10, బ్లాక్-2లో 5, బ్లాక్-3లో నాలుగు దుకాణాలు, మరో నాలుగు స్టాల్స్ పంచాయతీకి ఉన్నాయి.ఇటీవల పంచాయతీ సర్వసభ్య సమావేశంలో పంచాయతీ దుకాణాల అద్దెలు పెంచాలి, లేదా కొత్త దుకాణాలు నిర్మించి బహిరంగ వేలం ద్వారా కేటాయించాలన్న చర్చ సాగింది. ప్రస్తుత పాలకవర్గం పగ్గాలు అందుకున్న తర్వాత నాలుగు దఫాలుగా ఇదే అంశాన్ని చర్చించడం, అజెండాలో రాయడం తర్వాత గాలికి వదిలేయడం జరిగింది. అయితే ఎట్టకేలకు తాజాగా పంచాయతీ దుకాణాల అద్దెలు 100శాతం పెంచాలని పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. అద్దెలు పెంచుతున్నట్లు దుకాణాలను నిర్వహించుకుంటున్న వారికి నోటీసులు కూడా ఇచ్చారు.దుకాణాలను అద్దెకు తీసుకున్న వారిలో కొందరు బినామీలు మాత్రం అద్దెల పెంపు తమకు భారం అవుతుందని, గోల చేస్తున్నారు. అద్దెల పెంపు ప్రయత్నాన్ని విరమింపచేయాలని, స్థానిక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అద్దెలపెంపు ప్రతిపాదనలను అడ్డుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలను కలిశారు. వారు చూస్తాం అంటూ హామీ ఇచ్చినట్టు తెలిసింది.దుకాణదారుల్లో చాలామంది వేర్వేరు రాజకీయ పార్టీలో ఉండి, పలుకుబడి ప్రదర్శిస్తూ, పంచాయతీకి నామమాత్రపు అద్దెలు కడుతూ, తాము మాత్రం వేలల్లో వసూళ్లు చేసుకుంటున్నారు.

శాస్త్రీయత లేని అద్దె పెంపు

ప్రస్తుతం ఉన్న దుకాణాలకు కాలం చెల్లిందని, అవి వ్యాపారయోగ్యం కాదని గతంలో ఇంజినీరింగ్ అధికారులు ధృవీకరించారు. ప్రమాదాలకు కారణమవుతాయన్న దుకాణాల అద్దెల పెంపునకు పంచాయతీ అధికారులు ఎలా జెండా ఊపారో అర్థం కాని విషయం. దుకాణదారులంతా ఇదే విషయమై కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అద్దెల పెంపుపై ఇచ్చిన నోటీసుల్లో పాత అద్దెను ప్రస్తావించకుండా కొత్త అద్దెను సూచిస్తూ నోటీసులు పంపారు. ఒక్కొక్కరికి ఒక్కో తీరుగా అద్దె పెంచారన్న ప్రచారం సాగుతోంది. కోర్టు ద్వారా, లేదా పాలకు లకు కొంత సొమ్ము ఇచ్చైనా అద్దె పెంపును అడ్డుకోవాలని దుకాణదారులు చూ స్తున్నారు. దీని వెనుక కొందరు పాలకవర్గ సభ్యులే చక్రం తిప్పుతూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానికులు బాహాటంగా చెబుతున్నారు.

గ్రామాల్లో డీఎంహెచ్‌ఓ పర్యటన


అప్పన్నదొరపాలెంలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

కొత్తవలస: ‘మంచం పట్టిన పల్లెలు’ శీర్షికతో సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందిస్తున్నారు. డయేరియా కేసులు నమోదైన కాటికాపల్లి సచివాలయం పరిధి గొల్లపేటలో, విషజ్వరాలు విజృంభించిన అప్పన్నదొరపాలెం గ్రామంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ భాస్కరరావు శనివారం పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, మురుగు కాలువలో నుంచి వేసిన తాగునీటి పైపులను పరిశీలించారు. తక్షణమే పైపులను కాలువల నుంచి తొలగించాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించేలా చూడాలని వైద్యారోగ్య, పంచాయతీ సిబ్బందికి సూచించారు. అప్పన్నదొరపాలెంలో జ్వరాలు తగ్గుముఖం పట్టాయని, ప్రస్తుతం ఒక మహిళ మాత్రమే జ్వరంతో బాధపడుతున్నారని స్థానిక వైద్య సిబ్బంది ఆయనకు చెప్పడంతో ఆమెను పరామర్శించారు.అలాగే కాటికాపల్లి లో రెండు రోజులుగా డయేరియా కేసులు నమోదు కాలేదని వైద్య సిబ్బంది డీఎంహెచ్‌ఓకు వివరించారు. ఆయన వెంట కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాయవద్దు

- పంచాయతీల తీర్మానాలను పక్కన పెట్టడం తగదు
- ఉపాధి హామీ అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలి
- ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన సర్పంచ్‌లు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోపమ్మ, జెడ్పీటీసీ శ్రీదేవి, సర్పంచ్‌లు

కొత్తవలస: సర్పంచ్‌లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని, అధికారులు కూడా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడడం దారుణమని ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, సర్పంచ్‌లు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్ లతో కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీ శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వా రు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనుల ను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేపట్టి, చెల్లింపులు కూడా పంచాయతీ ఉపాధి హామీ బ్యాంక్ ఖాతా నుంచే చేయా లని కోరారు. గ్రామానికి ప్రథమ పౌరుడైన సర్పంచ్‌ను విస్మరించడం తగదన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులతో గ్రామాల్లో చేస్తున్న పనులకు తాము వ్యతిరేకం కాదని, ప్రజలతో ఎన్ని కోటిడిన పాలకవర్గం తీర్మానం చేసిన పనులను కాకుండా టీడీపీ వర్గీయులు గుర్తించిన పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలా గత ప్రభుత్వంలో జరగలేదన్నారు. పంచాయతీ పాల కవర్గం,సర్పంచ్ ప్రమేయం లేకుండా పనులకు వెండర్ పేరుతో బిల్లులు చెల్లించేందుకు సిద్ధమయ్యారని, ఇంతకంటే సర్పంచ్‌లకు అవమానం మరొకటి ఉంటుందా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ నిధులతో మంజూరయ్యే పనులన్నీ పంచాయతీ ఆధ్వర్యంలోనే సాగాలని ఉపాధి హామీ చట్టంలో ఉందని చెప్పారు. ప్రజాప్రతినిధుల విషయంలో గ్రామ, మండల స్థాయిలో కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ విషయాలపై రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు యలమంచిలి బాబు రాజేంద్ర ప్రసాద్ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. మండ లంలోని పలు గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించరా..?


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ శ్రీధర్

గజపతినగరం: గ్రామ సభలు, రెవెన్యూ సదస్సుల నిర్వహణలో అధికారులు ప్రోటోకాల్ పాటించరా అని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవు డు ప్రశ్నించారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో రీసర్వే భూసమస్యల పరిష్కార గ్రామసభను డీటీ జోగినాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అయితే రెవెన్యూ అధికారులు ఎంపీపీ, జెడ్పీటీసీకి సమాచారం ఇవ్వలేదు. కానీ ఎటువంటి పదవిలేని టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరు కావడం, ప్రసంగించడంతో స్థానికులు నివ్వెరపోయారు. దీనిపై ఎంపీపీ, జెడ్పీటీసీలు స్పందిస్తూ మండలంలో గతంలో గ్రామసభలు, రెవెన్యూ సదస్సులు, గ్రామసందర్శన వంటి ప్రభుత్వ కార్యక్రమాలు ఏం జరిగినా తమకు ప్రోటోకాల్ ప్రకారం అధి కారులు సమాచారం ఇచ్చేవారని, ప్రస్తుతం అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించా రు. ఎటువంటి పదవులు లేని నాయకులతో సద స్సులు, గ్రామసభలు నిర్వహిస్తుండడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ రత్నకుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా, గ్రామ రెవెన్యూ సదస్సులకు ఎంపీపీ, జెడ్పీటీసీలను ఆహ్వానించాలనే నిబంధన లేదని, గ్రామ పెద్దలు, ప్రజలు, రైతులకు మాత్రమే సమాచారం ఇస్తున్నామని చెప్పారు. ఆగ్రామ పెద్దలు ఎవరినైనా ఆహ్వానించుకోవచ్చని, కాలంరాజుపేటలో రెవన్యూ సదస్సుకు మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్‌కు కూడా తాము ఎటువంటి సమాచారం ఇవ్వలేదని వివరించారు.

ప్రజల రక్షణ కోసమే పోలీసులు


మాట్లాడుతున్న సీఐ ఎస్.వి.రమణమూర్తి

శృంగవరపుకోట: ప్రజల రక్షణ కోసమే పోలీసులు ఉన్నారని ఎస్.కోట సీఐ ఎస్.వి.రమణమూర్తి అన్నారు. గతంలో మావోయిస్టుల దాడిలో ప్రాణాలు వదిలిన పోలీస్ కానిస్టేబుల్ చిట్టిపంతులు చిరంజీవి చదువుకున్న కొట్టాం పాఠశాలలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సంద ర్భంగా శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా కానిస్టేబుల్ చిరంజీవి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సభలో పోలీసుల విధులు, బాధ్యతలు, ఉద్యోగంలో ఎదురయ్యే సవాళ్లను విద్యార్థులకు సీఐ వివరించారు. పోలీసులనూ మీలో ఒకరిగా గుర్తించాలని, శాంతిభద్రతల రక్షణలో ప్రజలందరి సహకారం అవసరమని చెప్పారు. పబ్లిక్ పోలీసింగ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, బాధ్యత ,జవాబుదారీతనం, నైతిక విలువలు, సంస్కారం అలవరుచుకుని బతకాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్


పోలీసుల విధులపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

గుర్ల: పోలీసు అమరవీరుల సంస్మరణలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివా రం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీ సులు ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, యంత్రాల పనితీరుపై మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీ వీ) విద్యార్థినులకు ఎస్‌ఐ పి.నారాయణరావు వివరించారు. పోలీసుల విధులు, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ, ఎఫ్ఐఆర్ నమోదు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పశుగణనకు సహకరించాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి అవినాష్, తదితరులు

దత్తిరాజేరు: ప్రభుత్వం చేపడుతున్న పశుగణనకు పాడి రైతులు సహకరించాలని పెదమానాపురం పశువైద్య కేంద్రం వైద్యాధికారి అవినాష్ కోరారు. పశుగణనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పెదకాదలో పాడిరైతులు, మండల మాజీ ఎంపీపీ పెద్దింటి మోహన్‌తో కలిసి శనివారం ఆవిష్క రించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన జరుగుతుందన్నారు. ప్రతీ ఇంటికి ఎన్యూమరేటర్లు వస్తారని, పశువులు ఉన్న రైతులు వాటి సమాచారాన్ని వారికి తెలియజేస్తే వివరాలను నమోదు చేసుకుంటారని చెప్పారు.

పశువుల సంతపై సమగ్ర నివేదిక ఇవ్వండి


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: మానాపురం పశువుల సంతపై సంబంధిత అధికారులు వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర చిన్న,మధ్య తరహా,సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బొండపల్లి,గజపతినగరం,దత్తిరాజేరు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎంపీడీఓల వద్ద అన్ని శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. మానాపురం సంతలో చనిపోయిన పశువులను నదీ పరివాహక ప్రాంతంలో పూడ్చివేస్తున్నారని పలువురు అధికారులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. మంత్రి స్పందిస్తూ నదీ పరివాహక ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాల బోర్లు ఎక్కువగా ఉన్నాయని, పశువుల మృతదేహాలను వాటి సమీపంలో ఖననం చేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొండపల్లితో పాటు గజపతినగరం మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లోపాన్ని గ్రామాల పర్యటనలో గుర్తించామని, తక్షణమే పారిశుధ్య పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు


యాత్రా స్పెషల్స్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం రమేష్, ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం పంచారామాల సందర్శనకు యాత్రా స్పెషల్స్ పేరిట ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ శనివారం తెలిపారు. ఈమేరకు యాత్రా స్పెషల్స్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పంచారామాల సందర్శనలో భాగంగా అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోటకు ఎస్.కోట నుంచి పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నవంబర్ 3, 10, 17, 24 (ఆదివారాలు) సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, తిరిగి మంగళవారం వేకువ జామున ఎస్.కోట డిపో కు చేరుకుంటాయన్నారు. ఎక్స్‌ప్రెస్‌కు రూ.1500, అల్ట్రా డీలక్స్‌కు రూ.1950, పల్లెవెలుగు బస్సులకు రూ.1150 చార్జీలుగా నిర్ణయించినట్లు స్ప ష్టం చేశారు. అయ్యప్ప భక్తులకు ఎస్.కోట నుంచి శబరిమల యాత్రకు వెళ్లేందుకు 7రోజుల యాత్ర, 11 రోజుల యాత్రకు స్వాములు కోరిన విధంగా బస్సులు ఇస్తామన్నారు. కార్తీక మాసం సందర్భంగా విశాఖదర్శిని, అరుకు దర్శిని, పుణ్యగిరి, లంబసింగి, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, టిక్కలి, రావివలస వెళ్లేందుకు, పిక్నిక్ స్పెషల్స్‌గా విద్యార్థులకు అందుబాటు ధరలో బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. సుశిక్షి తులైన డ్రైవర్ల పర్యవేక్షణలో, సురక్షితమైన ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ నమ్మకమైన ప్రజాసంస్థగా గుర్తించాలని కోరారు. యాత్రలు చేయదలచిన వారు, లేదా బస్సులు కావాల్సిన వారు ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ 73829 23679ను లేదా డిప్యూటీ సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ 94905 83579ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుమరాం విద్యార్థులు


జామి: క్రికెట్, అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన కుమరాం హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు


శృంగవరపుకోట: బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన నారాయణ స్కూల్ విద్యార్థులు

జామి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్, అథ్లెటిక్ పోటీలకు మండలంలోని కుమరాం ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ -14 బాలుర విభాగం క్రికెట్ పోటీల్లో బి.ప్రవీణ్ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టులో చోటు సాధించాడని పేర్కొన్నారు. అండర్ -17 బాలికల విభాగం 1,600 మీటర్ల పరుగు పందెం పోటీల్లో విద్యార్థిని ఎస్.సుప్రియ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీఈటీలు బి.సన్యాసినాయుడు, ఐ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు...

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.ప్రసాద్ శనివారం తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో కె.అభిషేక్‌రాజ్, ఎం.పూర్ణచంద్రశేఖర్, అండర్-17 బాలికల విభాగంలో ఎం.తుంగవిద్య జిల్లాస్థాయి పోటీ ల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురంలో నిర్వహించను న్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మాజీ ఎంపీపీ రాజన్నకు నివాళి


రాజన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి, తదితరులు

కొత్తవలస: మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు పాలమరశెట్టి రాజన్న ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు మంగళ పాలెంలోని ఆయన నివాసం వద్ద శనివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై, కుటుంబ సభ్యులను పరామ ర్శించి, ప్రగాడ సానుభూతి తెలిపారు.రాజన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కొత్తవలస ప్రాంతానికి రాజన్న చేసిన సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ అన్నారు. రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, నాయకులు మేలా స్త్రి అప్పారావు, పల్లా భీష్మ, జామి ఈశ్వర రావు, గొరపల్లి రవికుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఖాతాల ద్వారానే బిల్లులు చెల్లించాలి


ఎంపీడీఓ అప్పలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సరయు, ఎంపీపీ అరుణ, సర్పంచ్‌లు

జామి: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు గ్రామ పంచాయతీ ఖాతాల ద్వారానే చేపట్టాలని జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరు ణ, మండలంలోని 24 పంచాయతీల సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిష త్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మా ట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామాలకు మంజూరైన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం సర్పం చ్‌లను కాదని వెండర్స్ పేరుతో కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టేందుకే ఈ విధానాన్ని తీసుకువచ్చారని మండి పడ్డారు. వెండర్ పేరుతో బిల్లులు చెల్లించేటప్పుడు, ఆ వ్యక్తి సంబంధిత మెటీరి యల్ వ్యాపార రంగంలో ఉన్నాడా లేదా అనేది పరిశీ లించాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. ఎటువంటి సంబంధం లేని వ్యక్తితో పనులు చేయించి, బిల్లులు చెల్లించడం నిబంధనలకు వ్యతిరేకమని అన్నారు. కొన్ని గ్రామాల్లో గ్రామసభల్లో తీర్మానించిన పనులను కాకుండా తీర్మానంలో లేని పనులు మంజూరు చేశారని, తక్షణమే అటువంటి పనులను నిలిపివేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలను పంచా యతీలను నిర్వీర్యం చేస్తోందని, సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలకు వ్యతిరేకంగా పనులు చేస్తున్నారని, భవిష్యత్‌లో అధికారులు ఇబ్బందులు పడక తప్పదని హెచ్చరించారు. చట్టాలు,నిబంధనలకు వ్యతిరేకంగా పనులు, బిల్లుల చెల్లింపులు చేస్తే పోరాటం చేస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి అప్పాన సుబ్రహ్మణ్యం, గుడివాడ రాజేశ్వరరావుపాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు

దత్తిరాజేరు: హోటళ్లు, దుకాణాలు, మెకానిక్ షాపులు, వ్యాపార సంస్థల్లో మైనర్లను పనిలో పెట్టుకుంటే సంబంధిత వ్యక్తు లపై కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ అన్నారు. పెదమానాపురంలో దుకాణాలు, హోటళ్లలో శనివారం తనిఖీలు చేసి, ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లను పనిలో పెట్టుకోవద్దని, అనాథ మైనర్లు ఉంటే సమాచారం అందిస్తే వారిని ఎన్‌జీఓ హోమ్ ద్వారా చదివిస్తా మని చెప్పారు.ఎన్‌జీఓ సభ్యులు ఝాన్సీరాణి, మీనా పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

గంట్యాడ: బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె.రమాదేవి, కేస్ వర్కర్ టి.అనిత అన్నారు. రామవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థి నులకు శనివారం అవగాహన కల్పించారు. వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్‌లైన్ సేవలను వివరించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, బాలికలను ఎవరైనా వేధించినా చైల్డ్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని, మహిళలు ఆపదలో ఉంటే 181 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. హెచ్‌ఎం ఎం.యశోద పాల్గొన్నా రు.

పాఠశాలల సందర్శన

జామి/ వేపాడ: జామి మండలంలోని లొట్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బి.గంగరాజు, వేపాడ మండలంలోని వెల్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జగదీశ్వరరావు, పాటూరు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 బాలభాస్కరరావు శనివారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజన వంటలు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించి, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

29న పాడిరైతుల ధర్నా

లక్కవరపుకోట: విశాఖ డెయిరీకి పాలుపోసే పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29వ తేదీన విశాఖ డెయిరీ వద్ద ధర్నా నిర్వహించడంతో పాటు డెయిరీనీ ముట్టడించనున్నామని పాడిరైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొంప కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని లచ్చింపేట, చందులూరు,రేగ,కళ్లేపల్లి తదితర గ్రామాల్లో విశాఖ డెయిరీకి పాలుపోసే పాడిరైతులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, సకాలంలో బోనస్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పాడిరైతులు అంతా తరలిరావాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే..

గుర్ల: సమగ్రభూరీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూసమస్యలను పరిష్కారించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని డీటీ నారాయణమ్మ తెలిపా రు. పాలవలస సచి వాలయంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి భూసమస్యలపై వినతులు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాట్నూరు సన్యాసినాయుడు, వైస్ సర్పంచ్ వల్లూరి రాము, సర్వేయర్ శివ పాల్గొన్నారు.

చామలాపల్లిలో.

వేపాడ: మండలంలో చామలాపల్లి గ్రామంలో రీసర్వే భూసమస్యల పరిష్కార గ్రామసభను రెవెన్యూ అధికారులు శనివారం నిర్వహించారు. 39 మంది రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈనెల 30 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.